అధికారులపై దాడి వెనుక

ఎవరున్నా ఉపేక్షించొద్దు

- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి
- లగచర్ల ఘటనకు నిరసనగా కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా, దుద్యాల మండలం, లగచర్లలో అధికారులపై జరిగిన దాడి ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఈఘటన వెనుక ఎవరున్నా ఉపేక్షించొద్దని కోరారు. లగచర్ల ఘటనకు నిరసనగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఈఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా సేవలు అందించే అధికారులపై దాడులు, హత్యాయత్నం వంటి ఘటనలకు పూనుకోవడం వెనుకాల కుట్ర కోణం దాగి ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. లగచర్ల ఘటనలో కొందరు దాడికి గురైన ఉద్యోగులను కాకుండా, దాడికి పాల్పడిన వారిని పరామర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. అనంతరం హైదరాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ నాయకులు కె.రామకృష్ణ, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్.రాములు, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ అధ్యక్షులు డా.జి.నిర్మల, తెలంగాణ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు దర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెంగళరావు నగర్ డివిజన్‌లో సమస్యలను పరిష్కరించండి


జోనల్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న సాంబశివరావు, కాలనీవాసులు

వెంగళరావునగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వెంగళరావు నగర్ డివిజన్‌లోని బస్తీలు, కాలనీలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కంచండని ఇటీవల స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, సర్కిల్-19 డీఎంసీ జకీయా సుల్తానా, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ కుమార్, మేనేజర్ విక్రం,ఈఈ రాజ్‌కుమార్, వీధి దీపాల విభాగం ఈఈ మల్లికార్జున్, ఏఎంహెచ్‌వో సోలమన్ ఇతర అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని మధురానగర్, వెంగళరావునగర్, సిద్ధార్థ్ నగర్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. మధురానగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు కాలనీలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. యూసుఫ్‌గూడ బస్తీ డ్రైనేజీ పైప్‌లైన్ మధురానగర్ జీ-బ్లాక్‌లోని డ్రైనేజీ పైప్‌లైన్‌లోకి కలుపడంతో తరచూ మ్యాన్‌హోల్స్ పొంగి మురుగునీరు రహదారులపై ప్రవహిస్తోందని వివరించారు. జీ-బ్లాక్ పార్క్‌లో వాకింగ్‌ట్రాక్, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలని, నాలాపై రోడ్డు ఎగుడు దిగుడుగా ఉందని, సరిచేయాలన్నారు. ఈ.డీ పార్కులలో సౌకర్యాలు కల్పించాలని, పలు ప్రాంతాల్లో నూతనంగా సీసీ రోడ్లు వేయాలని కోరారు. వెంగళరావునగర్ కాలనీలో కొత్తగా రహదారులు, ఏ-టైప్ పార్క్‌లో చిన్నపిల్లలకు క్రీడాపరికరాలు ఏర్పాటు చేయాలని కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు కోరారు. సిద్దార్థనగర్ అధ్యక్షుడు విజయ్ కుమార్ కాలనీలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జవహర్‌నగర్‌లోని డంపింగ్ యార్డును, రహ్మత్‌నగర్ నాలాను, ఆయా ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారులను అధికారులు పరిశీలించారు. వీధిదీపాలకు వారం రోజుల్లో మరమ్మతులు చేయిస్తామన్నారు.

డిసెంబర్ 1న మాలల సింహగర్జన


సింహగర్జన పోస్టరును, కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, నాగరాజ్ తదితరులు

పంజాగుట్ట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న లక్షలాది మాలలతో 'హలో మాల.. చలో హైదరాబాద్' పేరుతో సింహగర్జన సభను సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టరును, కరపత్రాలను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చెన్నూరు, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు జి వివేక్ వెంకటస్వామి, కేఆర్ నాగరాజు, మాలల సమితి చైర్మన్ జి. చెన్నయ్య, కన్వీనర్ డి. సర్వయ్య, మాల సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాలల జనాబా 30 లక్షలు ఉన్నదని అయినా తగిన గుర్తింపు లభించడం లేదన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా జాగో మాల అనే కార్యక్రమాన్ని ఇప్పటికే చేపట్టామన్న ఆయన, డిసెంబరు 1న నిర్వహించ తలపెట్టిన మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో మాల(సీరియల్ నెంబర్ 34)అని రాయించాలి సూచించారు. సమావేశంలో మాల సంఘాల నాయకులు రాజు వస్తాద్, కొరివి వేణు, శంకర్,చెరుకు రాంచందర్, బైరి రమేష్, మాందాల భాస్కర్, రావుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు నిర్ధారణతో మధుమేహం నియంత్రణ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప

హైదరాబాద్ సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ముందస్తుగా రోగనిర్ధారణతో మధుమేహ సమస్యలను నివారించవచ్చునని వైద్యులు పేర్కొన్నారు. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో ఆరోగ్యకరమైన ఆహారం, సాధారణ శారీరకశ్రమ, ఒత్తిడి నిర్వహణ, సాధారణ గ్లూకోజ్ పర్యవేక్షణ, జీవనశైలి చర్యలు కీలకమన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా గురువారం నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లోని ఎండోక్రినాలజీ విభాగం, రీసెర్చ్ సొసైటీ ఫర్ ది స్టడీ ఆఫ్ ఇండియా ఇన్ ఇండియా ఆధ్వర్యంలో మధుమేహంపై అవగాహన, ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం డీన్ ప్రొఫెసర్ లీజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతీవర్ మాట్లాడారు. మధుమేహంతో జీవిస్తున్న వ్యక్తులు రోజువారీ సవాళ్లను, ఆందోళన, నిరాశ మానసిక సవాళ్లను ఎదుర్కొంటున్నారని వివరించారు. మధుమేహం వల్ల మూత్రపిండాలు, కళ్ళు నాడీ వ్యవస్థ, గుండె, మెదడు, దిగువ అవయవాలపై ప్రభావం చూపుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ద్వారా పిల్లలకు ఇన్సులిన్‌ను అత్యాధునిక చికిత్స అందించడంలో నిమ్స్ వైద్యులు చేస్తున్న కృషిని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్ అభినందించారు.

పీపుల్స్ ప్లాజాలో సైకిల్‌థాన్

ఖైరతాబాద్,నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా పీవీ నర్సింహారావు మార్గంలో డయబెటిస్‌పై అవగాహన కల్పిస్తూ సైకిల్‌థాన్, వాకథాన్‌ను డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించారు. పీపుల్స్‌ప్లాజా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు, తిరిగి అక్కడి నుంచి పీపుల్స్‌ప్లాజా వరకు సైకిల్‌థాన్ చేశారు. అనంతరం పీపుల్స్‌ప్లాజాలో ఉచిత డయాబెటిస్ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఇందులో డయాబెటిస్ వైద్యులు డాక్టర్ పవన్ కుమార్, చంద్రకాంత, అభినవ్‌రెడ్డి, శాంతిలాల్, రాజశేఖర్, అనూష తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బు రికవరీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బును రికవరీ చేసిన సైబర్‌క్రైం పోలీసులు బాధితుడి ఖాతాలో జమ చేయించారు. బ్యాంకు అధికారులమంటూ నగరానికి చెందిన వ్యక్తికి ఫోన్‌చేసిన సైబర్ నేరగాళ్లు.. క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని చెప్పారు. వారి సూచనల మేరకు వాట్సప్‌లో పంపిన లింక్‌ను ఓపెన్ చేసి వివరాలు నమోదు చేశాడు. ఆ లింక్ ద్వారా మాల్‌వేర్‌ను మొబైల్‌లోకి జొప్పించిన సైబర్‌నేరగాళ్లు మొబైల్‌ను తమ నియంత్రణలో తెచ్చుకొని అతడి క్రెడిట్ కార్డు నుంచి రూ.1,18,196 కొనుగోళ్లు చేశారు. విషయం తెలుసుకున్న బాధితుడు పోలీసులను సంప్రదించాడు. దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం పోలీసులు మొబైల్‌లో ఉన్న మాల్‌వేర్‌ను తొలగించి, ఎన్‌సీఆర్‌పీలో వివరాలు నమోదు చేశారు. కాజేసిన డబ్బుతో ఫ్లిప్‌కార్ట్‌లో కొనుగోళ్లు జరిగినట్లు గుర్తించిన సైబర్ క్రైం పోలీసులు సదరు ఈ కామర్స్ సంస్థను సంప్రదించారు. మోసపూరితంగా కాజేసిన డబ్బుతో కొనుగోళ్లు జరిగాయని వారికి వివరించి, నగదు బదిలీని నిలిపివేశారు. ఈ కామర్స్ సంస్థ ప్రతినిధుల సాయంతో సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బును బాధితుడి ఖాతాలో జమ చేయించారు. వేగంగా స్పందించి సైబర్ నేరగాళ్ల బారినపడి డబ్బులు పోగొట్టుకున్న బాధితుడికి తిరిగి డబ్బు ఇప్పించడంలో కీకలంగా వ్యవహరించిన సిబ్బందిని సీపీ ఆనంద్ అభినందించారు.

అర్ధాంతరంగా ఆగిన పనులు

- కమ్యూనిటీహాల్ నిర్మాణానికి గ్రహణం
- 50 శాతం పనుల పూర్తి
- ఎస్ఆర్‌నగర్‌లో రూ. 11.92 కోట్లతో రెండు సెల్లార్లు, రెండు ఫ్లోర్లు
- నిధుల లేమితో ముందుకు సాగని వైనం


కమ్యూనిటీహాల్ నమూనా

అమీర్‌పేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్, బల్కంపేట వాసులు ఎదురుచూస్తున్న మల్టీలెవల్ కమ్యూనిటీహాల్ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దాదాపు 11.92కోట్లతో రెండు సెల్లార్లు, రెండు అంతస్తుల్లో ఆధునిక హంగులు, అధునాతన సౌకర్యాలతో సర్వంగా సుందరంగా ఎస్ఆర్‌నగర్‌లో రూపుదిద్దుకుంటున్న కమ్యూనిటీహాల్ పనులకు గ్రహణం పట్టింది. స్థానికులు అభ్యర్థన మేరకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని హౌసింగ్ బోర్డు ఆధీనంలో ఉన్న 3185 గజాల స్థలంలో మోడ్రన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. వాస్తవంగా ఈ పనులు సంవత్సర కాలంలో పూర్తికావాల్సి ఉంది. ఆ స్థలంలో రాళ్లపొరలు అడ్డురావడం, వర్షాల కారణంగా పనుల్లో కాస్తా వేగం తగ్గింది. అతి కష్టం మీద రెండు సెల్లార్ల పనులను పూర్తిచేసి గ్రౌండ్ ఫ్లోర్ పనులకు శ్రీకారం చుట్టారు. మొత్తం 85271 ఎస్ఎఫ్టీ స్థలంలో నిర్మాణాలు పూర్తి అయ్యాయి.

10,494 ఎస్ఎఫ్టీలలో గ్రౌండ్ ఫ్లోర్, 11791 ఎస్ఎఫ్టీలలో ఫస్ట్ ఫ్లోర్, 12958 ఎస్ఎఫ్టీలలో సెకండ్ ఫ్లోర్, థర్డ్‌ఫ్లోర్ నిర్మించాల్సి ఉండగా నిధుల లేమితో తాత్కలింగా నిలిపివేశారు. ప్రధానంగా 5456.56 స్క్వేర్ ఫీట్ల స్థలంలో డైనింగ్‌హాల్, 4142.59 స్క్వేర్ స్థలంలో హాల్, 1434.02 స్థలంలో వాణిజ్య సముదాయాలు, సెల్లార్ నుంచి రెండు లిఫ్టులను ఏర్పాటు చేయల్సి ఉంది. వాణిజ్య కేంద్రమైన అమీర్‌పేటలో శుభకార్యాలు నిర్వహించుకోవడానికి తక్కువ ధరలో ఫంక్షన్‌హాళ్లు సామాన్యుడు అందుబాటులో ఉండవు. మల్టీ లెవల్ కమ్యూనిటీహాల్ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తే తక్కువ ఖర్చుతోనే పేద, మధ్యతరగతి ప్రజలు ఫంక్షన్‌లు, పెళ్లిళ్లు, శుభాకార్యాలు జరుపుకోవచ్చు.

ప్రభుత్వం మారడంతో...

ఆధునిక హంగులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో 18,535 స్క్వేర్ ఫీట్లలలో మొదటి సెల్లార్ ఇంతే స్థలంలో రెండో సెల్లార్ నిర్మాణాలు పూర్తి అయ్యాయి. మొదటి సెల్లార్‌లో 35 కార్లు, 26 బైకులు, రెండో సెల్లార్‌లో 34 కార్లు, 22 బైకులు పార్క్ చేసేలా నిర్మించారు. ప్రభుత్వం మారడంతో నిధులను పూర్తిగా నిలిపివేశారు. దీంతో 80 శాతం పూర్తి అయిన కమ్యూనిటీ హాల్ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో స్థానిక ఎమ్మెల్యే కూడా పనుల విషయంలో చొరవ తీసుకోవడం లేదు. ఈ విషయమై సంబంధిత అధికారులకు స్థానికులు పలుమార్లు విన్నవించిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.


అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు

ప్రేమ పేరుతో

మైనర్‌పై లైంగిక దాడి

బాధితురాలి ఫిర్యాదుతో కేసు

అమీర్‌పేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాను విలేకరిని అని పరిచయం చేసుకొని, ప్రేమ, పెళ్లి పేరుతో మైనర్‌పై లైంగికదాడికి పాల్పడటమే కాకుండా ఫొటోలు, వీడియోలతో బెదిరిస్తున్న వ్యక్తిపై ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎల్లారెడ్డిగూడలో ఉండే యువతి(22)కు ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రవీణ్ ముదిరాజ్(28) పరిచయమయ్యాడు. తాను ఓ దినపత్రికలో రిపోర్టర్‌ను అని నమ్మించి పరిచయం పెంచుకున్నాడు. ప్రేమ, పెళ్లి పేరుతో యువతికి దగ్గరైన ప్రవీణ్ అమీర్‌పేటలోని లాడ్జికి తీసుకెళ్లి యువతిపై లైంగిక దాడి చేశాడు. ఈ సమయంలో ఫొటోలు వీడియోలు తీసుకున్నా డు. తర్వాత ఫొటోలు, వీడియోలు కుటుంబ సభ్యులకు పంపుతానని, సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని యువతిని బెదిరిస్తున్నాడు. ఆందోళన చెందిన యువతి గురువారం ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న ప్రవీణ్‌ను గాలిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో 50 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా దానంనాగేందర్ మాట్లాడుతూ గతంలో ఆడపిల్ల వివాహం చేయాలంటే పేద కుటుంబం ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి. కాని ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం అమలు చేసిన తర్వాత ఆ పరిస్థితులు మారిపోయాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పేదప్రజల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు భద్రత కల్పించడమే లక్ష్యం


ఖాతాదారులతో మాట్లాడుతున్న డీజీఎం తుషార్‌కాంత్ ఝా

ఖైరతాబాద్, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాదారులకు సంపూర్ణ భద్రత కల్పించడమే లక్ష్యమని బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం తుషార్‌కాంత్ ఝా పేర్కొన్నారు. ఖైరతాబాద్ బ్రాంచ్‌లో ఖాతాదారుల(ఇంటరాక్షన్)తో ముఖాముఖీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తుషార్‌కాంత్ ఝా మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ డిజిటలైజేషన్ బ్యాంకింగ్‌తో ముందుకు వెళుతుందన్నారు. ప్రతి కస్టమర్‌ను కుటుంబ సభ్యుడిగా భావిస్తామన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్లకు జీవిత బీమా, ఆరోగ్య బీమా, డిపాజిట్లపై మంచి వడ్డీ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ ఎన్. ప్రతాప్‌కుమార్, ఏజీఎం ఏవీఎల్ నరసింహారావు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో


స్టాళ్ల వద్ద సందర్శకుల సందడి

బంజారాహిల్స్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, బాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశ ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 17 వరకు ప్రదర్శన జరుగుతుందన్నారు.

మింట్ కాంపౌండ్‌లో కూలిన చెట్టు.. ఆటోడ్రైవర్‌కు గాయాలు


రోడ్డుపై కూలిన చెట్టు

ఖైరతాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో అకస్మాత్తుగా చెట్టు కూలి రోడ్డుపై పడింది. ఈ ఘటనలో చెట్టు కింద ఉన్నడ్రైవర్‌కు గాయాలు కాగా, ఆటో పూర్తిగా ధ్వంసం అయినది. సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మింట్ కాంపౌండ్‌లోని ప్రింటింగ్ ప్రెస్ పక్కన పాత ఎండిపోయిన చెట్టు ఉంది. గురువారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగి కూలి రోడ్డుపై పడింది. చెట్టు కింద ఆటోలో నిద్రపోతున్న ఎల్‌బీనగర్‌కు చెందిన సయ్యద్ జానీ(డ్రైవర్) తలకు, ఛాతిలో గాయాలు అయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు గాయపడిన ఆటో డ్రైవరును ఆస్పత్రికి తరలించారు. అనంతరం జీహెచ్ఎంసీ సిబ్బంది రోడ్డుపై నుంచి చెట్టును తొలగించారు.

ఘనంగా బాలల దినోత్సవం


ఎల్బీ స్టేడియంలో జరిగిన జాతీయ బాలల దినోత్సవంలో పాల్గొని బయటకు వస్తున్న విద్యార్థినులు

యూసుఫ్‌గూడ/అమీర్‌పేట నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని యుసుఫ్‌గూడ, అమీర్‌పేట డివిజన్లలో ఘనంగా జరుపుకొన్నారు. దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం ఎస్సీఆర్ హిల్స్‌లో రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి.. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు నెహ్రూ చూపిన అడుగుజాడల్లో నడవాలన్నారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం ఎదుటు బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళా నాయకురాలు ఖమర్ హమీద మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, ఎలీషా, గిరిషా, అశ్విని తదితరులు పాల్గొన్నారు. యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనం చేశారు. ఎర్రగడ్డలోని బర్డ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్లో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు స్కూల్ నిర్వాహకులు జి శశిభూషణ్, జి శాంతి ప్రియ బహుతములు అందజేశారు. హేమవతి నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కాంగ్రెస్ పార్టీ నాయకుడు దూడల రవికుమార్ కేక్ కట్ చేయించారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణ కుమార్, గంటా మల్లేష్, మొహమ్మద్ సర్దార్, సురేష్ గౌడ్, యాకమ్మ తదితరులు పాల్గొన్నారు


సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట బాలల దినోత్సవంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఖమర్ హమీద, విజయలక్ష్మి, ఎలీషా, గిరిషా, అశ్విని తదితరులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో

భాగస్వాములు కావాలి: సీపీ

బంజారాహిల్స్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. తెలంగాణ విదాసమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 21న నెక్లెస్ రోడ్డులో జరగనున్న డ్రగ్స్ రహిత తెలంగాణ రన్, మానవహారం పోస్టర్‌ను బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. యువత తల్లిదండ్రుల కలలను సాకారం చేసి, ఉన్నత శిఖరలకు చేరుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలకు బానిసవ్వడం వల్ల మంచి భవిష్యత్తును కోల్పోతారన్నారు. కార్యక్రమంలో అశోక్, సాయినాథ్‌రెడ్డి, మంత్రి రాజు, చిరంజీవి, శ్యామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హైడ్రా సిబ్బందికి సూచనలు చేస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డె

ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో

హైడ్రా సిబ్బంది భాగస్వామ్యం

బంజారాహిల్స్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో హైడ్రా సిబ్బంది భాగస్వామ్యం అవుతున్నారని పశ్చిమ మండలం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డె అన్నారు. బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు వద్ద ట్రాఫిక్ విధులలో ఉన్న హైడ్రా సిబ్బందికి డీసీపీ రాహుల్ హెగ్డె, ఏసీపీ కట్టా హరిప్రసాద్ పలు సూచనలు చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ పెరుగుతున్న దరిమిలా ట్రాఫిక్ పోలీసులతోపాటు బయటి భాగస్వామ్యం కూడా అవసరం అవుతుందన్నారు. పశ్చిమ మండల పరిధిలో సుమారు 58 మంది హైడ్రా సిబ్బంది ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం శిక్షణ తీసుకున్నారన్నారు. వీరిని రద్దీ ఎక్కువగా ఉన్న చౌరస్తాలో వినియోగిస్తున్నట్టు వెల్లడించారు. ముఖ్యంగా స్టాప్‌లైన్, ఫ్రీలెఫ్ట్ నిబంధనలు వాహనదారులు పాటించేలా చూడాలని హైడ్రా సిబ్బందికి సూచించారు.

లష్కర్‌లో సందడే సందడి

వినూత్న వేషధారణల్లో అలరించిన చిన్నారులు

సికింద్రాబాద్/రెజిమెంటల్ బజార్/పద్మారావు నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): లష్కర్‌లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో నిర్వహించిన సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్‌లలోని పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది. వినూత్న వేషధారణల్లో చిన్నారులు అలరించారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని పలు పాఠశాలల్లో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గాంధీ, నెహ్రూ, పటేల్ తదితర మహనీయుల అడుగుజాడల్లో విద్యార్థులు నడవాలని పిలుపునిచ్చారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

బాలల దినోత్సవం సందర్భంగా గురువారం మోండా మార్కెట్ హిల్‌స్ట్రీట్ ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్ నాయకుడు సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హైదారాబాద్ నగర ఉపాధ్యక్షుడు అల్లాడి గౌరీశంకర్, నందికంటి రవి, బాబురావు, నరసింహ, నగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం బన్సీలాల్‌పేట్‌లోని చాచా నెహ్రూ నగర్ కమ్యూనిటీ హాల్‌లో కాంగ్రెస్ నాయకులు మల్లం రమేష్, నారాయణ ముదిరాజ్, పండుగౌడ్, జగదీష్ ఆధ్వర్యంలో బాల, బాలికలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి

అడ్డగుట్ట: విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాల్సిన బాధ్యత టీచర్లపై ఉందని వరల్డ్ విజన్ సంస్థ మేనేజర్ పీవీ కృష్ణ అన్నారు. అడ్డగుట్ట డివిజన్ ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలోని అంగన్‌వాడీలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ జ్యోతి, శ్యామ్, వలంటీర్ బాలమణి, ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రి చిన్నపిల్లల వార్డులో..

గాంధీ ఆస్పత్రిలోని చిన్న పిల్లల వార్డులో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. చికిత్స పొందుతున్న చిన్నారులకు ఆట వస్తువులు, బిస్కట్లు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యుడు ప్రొఫెసర్ సీఎం ప్రసాద్, నిలోఫర్ ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ భారతి రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, గాంధీ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి, డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సుబోధ్, ప్రొఫెసర్లు రవి శంకర్‌రావు, చంద్రశేఖర్, శ్రీనివాస్, మనోజ్, హర్ష, భరద్వాజ్ పాల్గొన్నారు.

లాల్‌బజార్ ప్రభుత్వ పాఠశాలలో..

తిరుమలగిరి: లాల్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మురళీ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని బాలికలకు బహుమతులు అందజేశారు. నెహ్రూ గురించి బాలికలకు ఆయన వివరించారు.

రాష్ట్రపతి నిలయంలో..

బొల్లారంలోగల రాష్ట్రపతి నిలయంలో రెండురోజుల పాటు నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జవహర్ బాల భవన్ డైరెక్టర్ విజయలక్ష్మి చిల్డ్రన్ ఎడ్యుకేషన్ చైర్మన్ వేదకుమార్ బుధవారం వేడుకలను ప్రారంభించారు. గురువారం ముఖ్యఅతిగా పాల్గొన్న జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ మెజీషియన్ రవిచంద్ర మేజిక్ చేసి చిన్నారులను అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశామని మేనేజర్ రజని ప్రియ తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్క బొమ్మలాటలు ఆకట్టుకున్నాయి.


చిన్నారులతో ఎమ్మెల్యే శ్రీగణేష్


బోయినపల్లిలో బాలికల ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేసిన జంపన ప్రతాప్


రాష్ట్రపతి నిలయంలో చిన్నారులతో చిల్డ్రన్ ఎడ్యుకేషన్ చైర్మన్ వేదకుమార్, జవహర్ బాల భవన్ డైరెక్టర్ విజయలక్ష్మి


అడ్డగుట్ట అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవంలో చిన్నారులు

దివ్యాంగులకు పెయింటింగ్ పోటీలు

బోయిన్‌పల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు సికింద్రాబాద్‌లోగల నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజేబిలిటీస్ సంస్థలో తారే జమీన్ పేరిట పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 500 మంది దివ్యాంగులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ రౌండ్‌టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ రీజనల్ వైస్ చైర్మన్ కౌశిక్ యక్కల పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఎన్ఐఈపీఐడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పెయింటింగ్ పోటీల్లో దివ్యాంగులు


గాంధీ ఆస్పత్రి చిన్నపిల్లల వార్డులో బాలల దినోత్సవం నిర్వహించిన వైద్యులు, సిబ్బంది

బన్సీలాల్‌పేట్‌లో నిర్వహించిన నెహ్రూ జయంతిలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు మల్లం రమేష్, నారాయణ ముదిరాజ్, పండుగౌడ్, బాలబాలికలు →




సీతాపతి కాలనీలో డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న జె.రామకృష్ణ

కాలనీల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

మారేడుపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె. రామకృష్ణ అన్నారు. గురువారం కంటోన్మెంట్ బోర్డు నాలుగో వార్డు పరిధిలోని సీతాపతి కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బోర్డు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు విజయానంద్, టోపీ శంకర్, రాజ్ మల్లేష్, బీజేపీ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


బాధితుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న స్కైలాబ్ యాదవ్

బాధితుడికి ఆర్థిక సహాయం

రెజిమెంటల్‌బజార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధమై ఉపాధి కోల్పోయిన బాధితుడికి బీఆర్ఎస్ నాయకుడు స్కైలాబ్ యాదవ్ ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం రాత్రి మోండా మార్కెట్‌లో ప్రమాదవశాత్తు పూజా సామగ్రి విక్రయించే షాపు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. మాజీ మంత్రి తలసాని ఆదేశాలతో బాధితుడికి గురువారం రూ. 20 వేలు అందజేశారు. బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, మోండా డివిజన్ నాయకులు మహేందర్, హమీద్, దాస్ పాల్గొన్నారు.


ర్యాలీలో ఆర్. కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, విద్యార్థులు

స్కాలర్‌షిప్‌ల బకాయిలు చెల్లించకపోతే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తాం : ఆర్. కృష్ణయ్య

ఎల్‌బీనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ యువజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి. అంజి ఆధ్వర్యంలో గురువారం ఆర్‌కేపురం నుంచి కొత్తపేట చౌరస్తా వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ల బకాయిలను మూడు రోజుల్లో విడుదల చేయకపోతే రాష్ట్రాన్ని అగ్నిగుండగా మారుస్తామని హెచ్చరించారు. 16న రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులతో కలిసి కలెక్టరేట్లు ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు నీల వెంకటేశ్, సతీష్, రవీందర్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి పురావస్తు ప్రాజెక్టుపై అధ్యయనం

బెల్జియం యూనివర్సిటీతో హెచ్‌సీయూ ఒప్పందం

హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బెల్జియంలోని ఘెంట్ యూనివర్సిటీ సహకారంతో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నీలగిరి పురావస్తు ప్రాజెక్టును చేపట్టింది. ఈ రెండు యూనివర్సిటీల ప్రతినిధులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా భాష, సంస్కృతి మధ్య సంబంధంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. భాషకు సంబంధించి సామాజిక గుర్తింపులు, సాంస్కృతిక పద్ధతులను పరిశీలించనున్నారు. సాంస్కృతిక సందర్భాలలో భాషా వినియోగాన్ని అర్థం చేసుకోవడానికి కమ్యూనిటీలతో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. భాషా వైవిధ్యాన్ని డాక్యుమెంటేషన్ చేయడం, పరిరక్షించడం ద్వారా తోడా, బడగ, కోట భాషల పద్ధతులను కూడా పోల్చి చూస్తారు.

హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ అప్లయిడ్ లింగ్విస్టిక్స్ స్టడీస్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎన్. రమేష్, బెల్జియంలోని ఘెంట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డానిలియా డి సిమోన్ ఈ నీలగిరి పురావస్తు ప్రాజెక్టు పరిశోధనలో భాగస్వాములుగా వ్యవహరించనున్నారు.


ఘెంట్ యూనివర్సిటీ ప్రతినిధులతో హెచ్‌సీయూ వీసీ బీజేరావు, ప్రొఫెసర్ రమేశ్ తదితరులు

సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బు రికవరీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరవాసి నుంచి సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బును సైబర్ క్రైం పోలీసులు రికవరీ చేశారు. బ్యాంకు అధికారులమంటూ నగరానికి చెందిన వ్యక్తికి ఫోన్‌చేసిన సైబర్ నేరగాళ్లు.. క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని చెప్పారు. వారి సూచన మేరకు వాట్సాప్‌లో పంపిన లింక్‌ను ఓపెన్ చేసి వివరాలు నమోదు చేశాడు. ఆ లింక్ ద్వారా మాల్‌వేర్‌ను మొబైల్‌లోకి జొప్పించిన సైబర్‌నేరగాళ్లు ఫోన్‌ను తమ నియంత్రణలోకి తెచ్చుకొని అతడి క్రెడిట్ కార్డు నుంచి రూ. 1,18,196తో కొనుగోళ్లు చేశారు.

విషయం తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొబైల్‌లో ఉన్న మాల్‌వేర్‌ను తొలగించి, ఎన్‌సీఆర్‌పీలో వివరాలు నమోదు చేశారు. కాజేసిన డబ్బుతో ఫ్లిప్‌కార్ట్‌లో కొనుగోళ్లు జరిగినట్లు గుర్తించిన సైబర్ క్రైం పోలీసులు సదరు ఈ కామర్స్ సంస్థను సంప్రదించారు. మోసపూరితంగా కాజేసిన డబ్బుతో కొనుగోళ్లు జరిగాయని వారికి వివరించి, నగదు బదిలీని నిలిపివేశారు. ఈ కామర్స్ సంస్థ ప్రతినిధుల సాయంతో సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బును రికవరీ చేసి బాధితుడి ఖాతాలో జమ చేయించారు. డబ్బు రికవరీలో కీలకంగా వ్యవహరించిన సిబ్బందిని సీపీ సీవీ ఆనంద్ అభినందించారు.

భూలక్ష్మీదేవి ఆలయంలో నేడు ప్రత్యేక పూజలు

మారేడుపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పికెట్‌లోని శ్రీభూలక్ష్మీదేవి ఆలయంలో ఉదయం 5గంటలకు శ్రీభూలక్ష్మీదేవికి పంచామృత అభిషేకం, 9 గంటలకు సత్యనారాయణ వ్రతం, సాయంత్రం 5 గంటలకు శ్రీపంచభూత భూమేశ్వర స్వామి శివపంచాయతన శివాలయంలో పంచామృత అభిషేకం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు జెట్టి ఉమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆకాశ దీపం, కార్తీకపౌర్ణమి జ్వాలా తోరణం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు రాత్రి వరకు జరుగుతాయన్నారు. కార్తీక శుక్ల పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి స్వామివారిని దర్శించుకుంటారని తెలిపారు. పౌర్ణమి వేడులకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

రెజిమెంటల్‌బజార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక డిమాండ్ చేశారు. గురువారం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయంలో ఘటన జరిగి నెలరోజులు అవుతున్నా ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందో చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కొంతం నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

నార్సింగ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నార్సింగ్ పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన శ్రీజ హైదర్షాకోట్‌లో సోదరి వద్ద ఉంటూ కోఠి డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది.

మూడు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. శ్రీజ మృతికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.